వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 350    మంగళవారం | 13 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




2లో

## లక్ష్యం వైపు దృష్టి పెట్టాలి

- పుట్టిన ప్రాంతం, కన్న తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలి
- చదువుకున్న కాలేజీకి అతిథిగా రావాలి
- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

# హాస్టళ్లలో.. ఏసీబీ దాడులు




వివరాలు 2లో..



హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రభుత్వ హాస్టళ్లలో ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాల తీరును పరిశీలిస్తున్నారు. కొంత కాలంగా ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదన్న ఫిర్యాదులపై ఆరా తీస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో కుళ్లిన కూరగాయలు, ఇతర పాడైపోయిన పదార్థాలతో ఆహారం వండుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దాడులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అదే విధంగా గతకొన్ని రోజులుగా వివిధ వసతి గృహాల్లోని విద్యార్థులు తరచూ ఫుడ్ పాయిజన్‌కు గురికావడానికి కూడా కలుషిత ఆహారమే కారణంగా భావిస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి తీవ్ర కడుపునొప్పితో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో సీరియస్‌గా తీసుకున్న ఏసీబీ అధికారులు ప్రభుత్వ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. అదే విధంగా వివిధ హాస్టళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పరిసరాలపై కూడా వారు నిశిత పరిశీలన చేస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

- తెల్లవారుజాము నుంచే తనిఖీలు
- కలుషిత ఆహారంపై వస్తున్న ఫిర్యాదులపై ఆరా
- పిల్లలు అనారోగ్యంపాలు కావడంపై సీరియస్
- వసతులు, పరిసరాలపై నిశిత పరిశీలన




8లో..

## నేతన్నలకు అండగా ఉంటా

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- పవర్ లూమ్ కార్మికులతో చర్చలు




## ఆగస్ట్ 31 డెడ్ లైన్

నాటు సారాపై ఉక్కుపాదం మోపండి

2లో..









8లో

## ఘనంగా హర్ ఘర్ తిరంగ అభియాన్

పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

# హాస్టళ్లలో ఏసీబీ దాడులు



**తెల్లవారుజాము నుంచే తనిఖీలు**

**కలుషిత ఆహారంపై వస్తున్న ఫిర్యాదులపై ఆరా**

**పిల్లలు అనారోగ్యంపాలు కావడంపై సీరియస్**

**వసతులు, పరిసరాలపై నిశిత పరిశీలన**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిరుపేదలతోపాటు మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకులాలు, హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు, అటవీ ప్రాంతాన్ని తలపిస్తున్న పరిసరాలు, అరకొర వసతుల మధ్యన నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. ఆవరణలో చెట్లపొదలు, పాముల పుట్టలు పిల్లలను వణికిస్తున్నాయి. స్నానపుగదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా కరువయ్యాయి. పడుకునేందుకు బెడ్లు కూడా లేక నేలపైనే నిద్రించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అనేక హాస్టళ్లలో రాత్రిపూట కరెంట్ పోతే చీకట్లు కమ్ముకుంటున్నాయి.

## ఫుడ్ పాయిజన్..

మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో 15 రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం, మరో నలుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడానికి నిర్వహణ లోపం, వసతుల లేమే కారణంగా భావిస్తున్నారు. పరిసరాలు విద్యార్థులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో వారు భయభయంగా కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది నెలల వ్యవధిలోనే ఫుడ్ పాయిజన్ కారణంగా సుమారు 500మంది విద్యార్థులు ఆస్పత్రులపాలయ్యారు. నిన్న సంగారెడ్డి జిల్లాలోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 24మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.

## వార్డెన్లలో ఆందోళన..

హాస్టళ్లలో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో ఏసీబీ దాడులు నిర్వహించడంతో వార్డెన్లలో ఆందోళన నెలకొంది. గత కొంత కాలంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వారిలో టెన్షన్ మొదలైంది. కూరగాయలు, నిత్యావసరాలు సరఫరా చేస్తున్న వ్యక్తులతో కుమ్మక్కై పర్సంటేజీలు గుంజుతున్న వారికి ఏసీబీ తనిఖీలు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. తమ హాస్టల్ పైకూడా ఏసీబీ అధికారులు ఎప్పుడు దాడులు నిర్వహిస్తారోనన్న ఆందోళన కనిపించింది.

## ఏసీబీ తనిఖీలు..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో తెల్లవారు జామునుంచే ఏసీబీ అధికారులు హాస్టళ్లకు చేరుకుని సోదాలు చేశారు. వసతి గృహాల్లోని రికార్డుల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఫిజికల్ గా ఎంతమంది ఉన్నారు? అంటూ ఆరా తీశారు. ఆహార నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందరికీ నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. నాసిరకం, పాడై పోయిన కూరగాయలు, ఇతర పదార్థాలను వినియోగించడంపై తనిఖీలు నిర్వహించారు. తక్కువ ధరకు నిత్యావసరాలు కొనుగోలు చేసి అధిక మొత్తంలో బిల్లులు పెట్టడంపై నిశితంగా పరిశీలన చేశారు. తప్పుడు బిల్లులతో విద్యార్థులకు అందించాల్సిన వాటిని పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై విద్యార్థులను, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు.



# లక్ష్యం వైపు దృష్టి పెట్టాలి

**పుట్టిన ప్రాంతం, కన్న తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలి**

**చదువుకున్న కాలేజీకి అతిథిగా రావాలి**

**సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ లో మోషన్ జూనియర్ కాలేజ్ ప్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి అప్పులు తెచ్చి మంచి కళాశాలలో జాయిన్ చేయిస్తున్న విషయాన్ని మరువరాదన్నారు. దాన్ని విద్యార్థులు గుర్తుంచుకొని ఎప్పటికప్పుడు తమను తాము మెరుగుపరుచుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసేందుకు అనేక సాధనాలు మనకు అందుబాటులో ఉన్నాయని వాటిలో ముఖ్యంగా మొబైల్ ఒకటన్నారు. దానిని విద్యార్థులు రెండు సంవత్సరాలు పక్కకు పెట్టాలని సూచించారు. విద్యార్థులు తమతో తామే పోటీ పడుతూ ఇంతకు ముందు కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకోవాలన్నారు. టైం అనేది చాలా ముఖ్యమైనది ఏదైనా విషయం పైన పదివేల గంటలు శ్రద్ధ పెట్టగలిగితే దానిని సాధించడం చాలా సులువు అవుతుందన్నారు. విద్యార్థులు ఈ రెండు సంవత్సరాలలో 10 వేల గంటలు తమ లక్ష్యం కోసం పనిచేసేలా కృషి చేయాలన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవాలి, ఎవరివల్ల అయితే మన విలువ పెరుగుతుందో వారిని ఎంచుకొని పరీక్షలను పండుగలాగా చూడాలి. పరీక్షలు అంటే భయపడకుండా ఇష్టంగా సెలబ్రేట్ చేసుకునే విధంగా ఉండాలన్నారు. నిద్ర అనేది విద్యార్థులకు చాలా ముఖ్యం కనీసం ఏడు గంటలైనా నిద్రపోవాలి రోజులో అరగంటైనా ఫిజికల్ ఎక్సర్సైజ్ చేయాలని సూచించారు. ఫిజికల్ ఎక్సర్సైజ్ చేయడం వల్ల శరీరం మెదడు రెండూ ఉత్తేజంగా మారుతుందన్నారు. ఎప్పుడూ విద్యార్థుల మార్కులను అందరి ముందు డిస్ప్లే చేయకుండా వ్యక్తిగతంగా పిలిచి మాట్లాడాలని అధ్యాపకులకు సూచించారు. మనం పుట్టిన ప్రాంతం మనల్ని కన్న తల్లిదండ్రులు గొప్పగా చెప్పుకునే స్థాయికి ఎదిగి మనం చదువుకున్న కళాశాలకే ముఖ్యఅతిథిగా హాజరయ్యే విధంగా మారాలి అన్నారు. మన సంతకం ఆటోగ్రాఫ్ గా మారేలా కృషి చేయాలన్నారు. కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలు ఎవరైతే కష్టపడతారో వారు విజయం సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకొని జీవితాంతం చాలా ఆనందంగా గడుపుతారన్నారు. ఎవరైతే ఈ రెండు సంవత్సరాలు ఎంజాయ్ చేస్తారో వారు జీవితాంతం కష్టపడాల్సి వస్తుందన్నారు. అందుకోసం ఈ రెండు సంవత్సరాలు విద్యార్థులు లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్స్ చిర్ర గణేష్, శరత్, పేరుమాండ్ల అనిల్, కాలేజీ కోటా అధ్యాపకులు అనుజ్ కపూర్, సాహిల్ కత్యాల్, మోహన్ మంగళం, ప్రదీప్ పట్కార్, దమన్, అవినాష్, సురేందర్, కాలేజీ సిబ్బంది మురళి, రమేష్, సాగర్, రాజు, శశి, శివ, అరుణ్, రవళి, అరుణ, శిల్ప, మమత తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్ట్ 31 డెడ్ లైన్
# నాటు సారాపై ఉక్కు పాదం మోపండి

**ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి**

**వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పల్లెలను, తాండాలను పట్టిపీడిస్తున్న నాటు సారాను తుది ముట్టించేందుకు సమష్టి కృషి చేయాలని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎక్సైజ్, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల సమీక్షా సమావేశంలో మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 31 నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాటు సారా లేకుండా చేయడానికి మీ వంతుగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వరంగల్ జిల్లాలో నాటు సారాపై ఉక్కు పాదం మోపడానికి యంత్రాంగం చేసిన కృషి ప్రశంసనీయంగా ఉందన్నారు. మరింత చొరవ తీసుకొని పూర్తి స్థాయిలో నాటు సారాను నిర్మూలించాలని ఎక్సైజ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రధానంగా నాటు సారా తయారీకి వినియోగించే బెల్లం, ఆలం సరఫరాపై గట్టి నిఘా పెట్టాలన్నారు. సరఫరా చేస్తున్న వ్యక్తులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కూడా పెట్టి వారిని కోర్టు మెట్లు ఎక్కించాలన్నారు. ఈ సమావేశానికి ప్రత్యేకంగా హాజరైన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబరీ కిషోర్ జా మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామన్నారు. నాటుసారా, గంజాయి, ఇతర డ్రగ్స్ పై సమష్టిగా పనిచేసి ముందుకు సాగుతామన్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆదేశాల మేరకు అందరం కలిసి వరంగల్ ను ఫ్రీ డ్రగ్స్ ఏరియా, ఫ్రీ నాటు సారా ఏరియాగా తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం అన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్ మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావుతో పాటు ఐదు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెట్లు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



# పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

## ఈనెల 18న రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

## పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు నేత



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పద్మశాలీలు, చేనేత కార్మికులు తమ సమస్యల సాధనతో పాటు అభివృద్ధి చేసుకునేందుకు ఐక్యతను చాటాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాజీ ఎంపీపీ వేముల బాలరాజు నేత, జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి నేత పిలుపునిచ్చారు. మంగళవారం రఘునాథపల్లి మండల కేంద్రంలో ఈనెల 18న జరిగే రాష్ట్ర కమిటీ ఎన్నికల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశానికి మండల అధ్యక్షుడు కరిమికొండ వెంకటేశ్వర్లు నేత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమ కోసం చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. పద్మశాలీలు రాజకీయంగా ఎదిగినప్పుడే అభ్యున్నతి సాధ్యమని, పద్మశాలి ఐక్యతను చాటేందుకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఏర్పడిందని వారు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కోసం 33 వేల కోట్ల రూపాయలు విడుదల చేసి రుణమాఫీ చేయడం జరిగిందని, అదేవిధంగా చేనేత రుణమాఫీ కోసం రూ. 65 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా పోరాడుదామన్నారు. ఈనెల 18న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికలు గ్రామ గ్రామాన నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల్లో సుమారు 50 వేల మంది చేనేత కార్మికులు, పద్మశాలి బాంధవులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్ నేత, జిల్లా నాయకులు గుండ కృష్ణమూర్తి నేత, మచ్చ బాల నరసయ్య నేత, సత్యనారాయణ నేత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాయినిని కలిసిన నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని హనుమకొండకు వచ్చిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో మంగళవారం 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్, బంక సంపత్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సమ్మయ్య, ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# దివ్యాంగుల సేవ.. విశ్వమానవ సేవ

## మానసిక దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి, హనుమకొండలోని మల్లికాంబ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో పిల్లలకు కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని అన్నారు. వీరికి అందరికి ఉన్న హక్కులు ఉంటాయని, వారిని హేళన చేసినా, ఇబ్బంది పెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని అన్నారు. వీరికి ప్రేమ, ఆప్యాయతలు పంచితే అందరిలో కలిసి పోయి అభివృద్ధి చెందుతారని, వీరికి ఓపికతో నేర్పించాలని, ప్రతి ఒక్కరూ తోచిన మేర సహాయసహకారాలు అందించాలని కోరారు. పిల్లలు కొత్త బట్టలు చూచి కేరింతలు కొడుతూ ఆనంద పడ్డారు. డాక్టర్ అనితా రెడ్డి, మల్లికాంబ నిర్వహకులు బండా రామలీల, కళ్యాణ్, టీచర్స్, పిల్లలు, సిబ్బంది పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఇస్లాం జామిత్ ముసుగులో మారణ హోమం

## ముస్లింల అరాచకాలను ప్రపంచ దేశాలు ఖండించాలి

## ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య గౌడ్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** బంగ్లాదేశ్‌లో ఇస్లాం జామిద్ ముసుగులో ముస్లింలు మారణ హోమం సృష్టిస్తూ..అమాయకులైన హిందువులను, హిందువు మహిళలను టార్గెట్ చేస్తూ అత్యాచారాలు, హత్యలు, వేధింపులు, చిన్నపిల్లలను సైతం చూడకుండా చంపేస్తున్నారని, ముస్లింల అరాచకాలను యావత్ ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్ఎస్ఎస్ కార్యవాహ బుర్ర సదయ్య గౌడ్ అన్నారు. మంగళవారం బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న మారణ హోమానికి నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలో వ్యాపారస్తులు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ బుర్ర సదయ్య గౌడ్ మాట్లాడారు. హిందువునని జీవించండి.. హిందువులుగా ఒక్కటై గర్జించండని ఆయన పిలుపునిచ్చారు. హిందువులు అయితే చాలు వారిపై అరాచకంగా దాడులు చేస్తూ, మహిళలపై గ్యాంగ్ రేప్ లు చేస్తూ, చిన్నపిల్లలను సైతం వదలకుండా, మృగాల్లాగా వెంటపడుతూ చంపి వేస్తున్నారన్నారు. ఇది యావత్ ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించి..ముస్లింల అరాచకాలను అరికట్టేందుకు ప్రపంచ దేశాలు ఒక్కటై తీవ్రవాద దేశాలను అణచివేయాలని ఆయన కోరారు. అలాగే మన భారతదేశం అన్ని మతాలను, అన్ని కులాలను గౌరవిస్తూ..అనుకూలంగా ఉంటూ..సోదర, సోదరీ భావంతో అభివృద్ధియే ఏజెండాగా ముందుకు సాగుతుంటే, ఈ దేశంలో మతాల మధ్యన, కులాల మధ్యన చిచ్చుపెట్టి జాతీయ వాదాన్ని దెబ్బతీసే కుట్రలు చేస్తూ భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కొందరు కుహనా లౌకికవాదులు విదేశీ ఉగ్రవాదులతో చేతులు కలుపుతున్నారని అన్నారు. దేశంలో అల్లర్లను సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని బుర్ర సదయ్య గౌడ్ మండిపడ్డారు. ఈ తరుణంలో భారత్ లోని హిందువులంతా ఏకమై ఆనాడు స్వామి వివేకానంద చెప్పినట్లుగా హిందువునని జీవించు..హిందువులుగా గర్జించి మన అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన దేశ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవడంలోనే మన దేశ సమైక్యత భావం ఇమిడి ఉన్నదని, హిందువులంతా సమైక్యతగా ఉంటేనే బంగ్లాదేశ్ లో జరిగేటటువంటి మారణ హోమాలు జరగకుండా ఉంటాయన్నారు. అందుకే ఇప్పటికైనా హిందువులంతా సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు కనుకుల లక్ష్మారెడ్డి, బుర్ర వెంకటేష్ గౌడ్, చెక్క నర్సయ్య, గుండా సురేష్, వేల్పుల రాజ్ కుమార్, కసిరెడ్డి తిరుపతిరెడ్డి, మాచర్ల రఘు, కంచ కుమార్, స్వామి, మైదం శ్రీకాంత్, మాసు రమేష్, రాకేష్, తాటిపల్లి శ్రీనివాస్, చింతల రాజేందర్, కత్తుల ఐలయ్య, గోపగాని స్వామి, సారంగపాణి, మార్త అశోక్, కదం రాజు, రాయిని శ్రీనివాస్, గోపగాని రాజు, పిట్టల నాగరాజు, శ్రావణ్, వల్లాల ప్రవీణ్, ప్రభాకర్, తూముల జగదీష్, శ్రీహరి, కాల్వచర్ల కిషోర్, రంగుల బుర్ర తిరుపతి హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు ఆర్ఓ వాటర్ మిని ప్లాంట్ అందజేత



**వరంగల్ వాయిస్, గొర్రెకుంట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ గొర్రెకుంటలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి కానిస్టేబుల్ నమీండ్ల సాధన్ పాఠశాలకు తాగునీటిని శుభ్రపరిచే ఆర్ఓ మినీ వాటర్ ప్లాంట్ ను బహూకరించారు. ఈ సందర్భంగా నమీండ్ల సాధన్ మాట్లాడుతూ మన పాఠశాలలో చదివే విద్యార్థిని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిర్మయి మాట్లాడుతూ చాలా కాలంగా మా పాఠశాలకు అనేక విధాలుగా సేవలు అందిస్తున్న సాధన్ సేవలు చాలా అభినందనీయమని కొనియాడారు. అదే విధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు పాఠశాలకు సాధన్ చేస్తున్నసేవా కార్యక్రమాలను గ్రామ పూర్వ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు ఆర్ఓ మినీ వాటర్ ప్లాంట్ ను బహూకరించిన పూర్వ విద్యార్థి కానిస్టేబుల్ సాధన్ ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు నమీండ్ల క్లిమెంట్, ఎలగొండ ప్రవీణ్, నమీండ్ల కిరణ్, మాచర్ల కార్తీక్, సిలువేరు రవి, ఇంద ఆరోగ్యం, సిలువేరు సుమన్ పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో శాంతి కలగాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బంగ్లాదేశ్ లో మైనారిటీ హిందువులపై జరుగుతున్నదాడులను వెంటనే ఆపాలని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ బాధ్యులు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడ అమాయకపు ప్రజలపై దాడులను నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్ లాల్ తెలిపారు. ముఖ్యంగా దీని ప్రభావం ఆ దేశాన్ని ఆనుకొని ఉన్న భారత్ సరిహద్దు రాష్ట్రాలపై పడుతుందని, ఎంతోమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని వ్యతిరేకించటం శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరి బాధ్యత అని మహమ్మద్ సిరాజుద్దీన్ అన్నారు. త్వరలో బంగ్లాదేశ్ లో శాంతి నెలకొనాలని వారు కోరారు. అనంతరం ప్లకార్డులు చేత బూని శాంతి జెండాలను పట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా– ఇజ్రాయిల్ యుద్ధం త్వరగా ఆగిపోవాలని ఈ సందర్భంగా సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయబాబు, ప్రొఫెసర్ నరసింహమూర్తి, శ్రీపాద సుధాకర్ రావు, కుసుమ కవిత, మండల పరశురాముడు, పొడి శెట్టి విష్ణువర్ధన్, నిమ్మల శ్రీనివాస్, పొన్నాల రామ్మోహన్, జంగా గోపాలరెడ్డి, శనిగరపు రాజమోహన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి

## తక్కళ్ల పల్లి శ్రీనివాస్ రావు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో ఉద్యమాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించిన శ్రీనివాస్ రావు విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి సమాజ అభ్యున్నతికై తోడ్పడాలని కోరారు. ధన ప్రవాహంలో కొట్టుమిట్టాడుతున్న రాజకీయాలను, ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడిందని, స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. అనేకమంది ముఖ్యమంత్రులను, ప్రధానమంత్రులను అందించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రైవేటు విద్య, అధిక ఫీజలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఉద్యమాలు నిర్వహించాలని తెలిపారు. ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జి రెహమాన్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, భాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా కౌన్సిల్ సభ్యులు వినయ్, అజహారోద్దీన్, కరీష్మా, కుషల్, సంతోషింహని పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడపొద్దు

## ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాహనదారులు ఎవరు తమ కుటుంబ భవిష్యత్తు బాగుండాలంటే మద్యం సేవించి వాహనాలు నడపొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ వాహనదారులకు సూచించారు. ట్రైసిటి పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో ట్రాఫిక్, లా అండ్ అర్డర్ పోలీసులకు పట్టుబడిన వాహనదారులకు వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ట్రాఫిక్ కౌన్సిలింగ్ సెంటర్‌లో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ముఖ్య అతిధిగా హజరై వాహనదారులు, వారితో వచ్చిన వారి కుటుంబ సభ్యులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మద్యం సేవించి రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో అధికంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని, వీరి మరణంతో ఈ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. వాహనదారుడు మద్యం సేవించి వాహనం నడపటం ద్వారా రోడ్లపై వేళ్లే పాదచారులు కూడా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోపోడంతో పాటు వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ సంవత్సరంలో ట్రై సిటి పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులకు సంబంధించి మొత్తం 5410 కేసులు నమోదు కావడంతో పాటు 60 మంది వాహనదారులకు ఒకటి లేదా రెండు రోజుల పాటు జైలు శిక్షలు విధించడం జరిగిందని, అలాగే మరో 5095 మంది వాహనదారులు జరిమానాలు చెల్లించారని తెలియజేశారు. ఇకపై వాహనదారుడు మద్యం సేవించి వాహనం నడపడాన్ని కుటుంబ సభ్యులే వ్యతిరేకించాలని ట్రాఫిక్ ఏసీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇంచార్జి ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ బుచ్చి రెడ్డి, ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు

# గౌడ కులస్తులకు అండగా ఉంటా

## మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహన్ని పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనిత రామకృష్ణ డొనేషన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సోదా అనిత రామకృష్ణ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మొట్టమొదటి బహుజన వీరుడు, బహుజన చక్రవర్తి, బహుజన నాయకుడు అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని డొనేషన్ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఊరును పరిపాలిస్తే ఏమి లాభం పల్లెను పరిపాలిస్తే ఏమి లాభం పరిపాలిస్తే గోల్కొండ కోటనే పరిపాలించాలని 17వ శతాబ్దంలోనే దక్కన్ గడ్డపై మొదటిసారిగా బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. ఒక సాధారణ గౌడ కులంలో జన్మించి ఆనాటి సామాజిక వ్యవస్థలోనున్న ఆధిపత్య కులాల అధికారాన్ని, బానిసత్వాన్ని ధిక్కరించి దళిత బహుజనులను రాజ్యాధికారం వైపు నడిపిన తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సోదా అనిత రామకృష్ణ అన్నారు

# డివైడర్లలో కానోకార్పస్ స్థానంలో కొత్త మొక్కలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 22, 36 వార్డు పరిధిలోని కోర్టు నుంచి మూడు కోట్ల జంక్షన్ వరకు నేడు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వయంగా చెట్లు నాటారు. ఈ సందర్భంగా గతంలో ఉన్న కానోకార్పస్ మొక్కలు ప్రజల ఊపిరితిత్తులకు హాని కలిగించే చెట్లను తొలగించాలని పలుసార్లు నిరసనలు కూడా తెలపడం జరిగింది. ఎట్టకేలకు చెట్లను తొలగించి వేరే చెట్లను నాటారు. ఈ సందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ చెట్లను నాటడం ప్రతి ఒక్క మనిషి మానవ ధర్మం అని అన్నారు. చెట్లు నాటడం వల్ల భవిష్యత్తు తరాలకు మంచి గాలి వచ్చి ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటాలని ధ్యేయంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ ఈ వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాలను కాపాడుకోవాలని కోరారు. ఈ చెట్లు నాటే కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చెట్ల కాంట్రాక్టర్ బుజ్జి వెంకన్న, మున్సిపల్ సిబ్బంది క్రాంతి, గ్రీన్ టీం, పెరుగు కుమార్, తోట రాజకుమారి, రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగ ర్యాలీ




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇండ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్ లాల్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తిని కొనసాగించేందుకు ప్రజల్లో ఉత్సాహం నింపి దేశ సమైక్యతను కాపాడాలన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అన్ని వర్గాలు పాలుపంచుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో పాఠశాల విద్యార్థులు, బీజేవైఎం నేతలు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్ లాల్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

## ఎంపీ పొరిక బలరాం నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మహబూబాబాద్ ఎంపీ పొరిక బలరాం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 103 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ తో కలసి ఎంపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు, రైతు బంధు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇతర పార్టీల మాటలు నమ్మొద్దని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలు నేరుగా ప్రజలకు అందజేస్తామన్నారు. త్వరలోనే మహిళలకు మహాలక్ష్మి పథకంలో బాగంగా ప్రతి నెల రూ.2,500, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, తదితర సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు. ఇది ప్రజా ప్రభుత్వమని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సి లర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఇంజినీర్ మోహన్ రెడ్డికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** స్థానిక సింగరేణి ఓసి త్రీ నుంచి రామగుండం బదిలీపై వెళ్తున్న ఇంజినీర్ మోహన్ రెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీవైజీఎం భాను ప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ కుమార్ స్వామి, వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీ సాయి కృష్ణ, ఏఐటీయూసీ బ్రాంచ్ నాయకులు విజేందర్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, ఐఎన్ టీయూసీ బ్రాంచ్ నాయకులు హాజరై మాట్లాడారు. అధికారులు సింగరేణి ఉద్యోగులు పాల్గొని మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో 36 మందికి జరిమాన

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ 03 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.3000 జరిమాన విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో 36 మందికి రూ.54,300 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కు. రామకృష్ణ తెలిపారు.

# చిన్నకోడెపాకలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, రేగొండ :** కొత్తపల్లి గోరి మండలం, చిన్నకోడెపాక గ్రామంలో పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు జలుబు, దగ్గు, జ్వరం సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటా తిరిగి లార్వా సర్వే చేశారన్నారు. వారానికి ఒకసారి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటి వల్ల డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, టైపాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, ఏఎన్ఎంఎస్ సుగుణ, మంజుల, ఆశ తిరుమల, సుమలత, పంచాయతీ సెక్రటరీ సరిత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కారుడు సతీష్ మృతి

## పార్థివదేహానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నివాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 26వ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ కారుడు దుర్గేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్, వరంగల్ పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీష్ ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం వారి నివాసానికి వెళ్లి అతడి పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం నింపారు.



# డ్రంకెన్ డ్రైవ్ కేసులో వినూత్న తీర్పు

## సమాజసేవ శిక్ష విధించిన కోర్టు




**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ఆదేశాల మేరకు కాజీపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మడికొండ ప్రాంతానికి చెందిన కందుల నాగరాజు, బాస్కె సురేష్ మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై తిరుగుతుండగా వారిని ట్రాఫిక్ పోలీసులు గమనించి పరీక్షించారు. పెద్ద స్థాయిలో మద్యం సేవించినట్లుగా నిర్ధారణ కావడంతో సదరు మద్యం సేవించిన వాహనదారులను మంగళవారం రెండవ తరగతి కోర్టు న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరు పర్చారు. వాహన దారులు సేవించిన మద్యం మోతాదును పరిశీలించిన న్యాయమూర్తి మద్యం సేవించి వాహనం నడపడాన్ని నేరంగా పరిగణిస్తూ సదరు వాహనదారులను రెండు రోజుల పాటు సమాజసేవ చేయాల్సిందని తీర్పునిచ్చారు. ఈ తీర్పును అనుసరించి స్థానిక కాజీపేట తహసీల్దార్ ఎదుట హాజరు పరచడం జరిగిందని కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ నాగబాబు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తపాల సేవలు వినియోగించుకోండి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తపాలా శాఖ ద్వారా అందించే సేవల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నర్సంపేట పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్ స్పెక్టర్ సుచందర్ అన్నారు. మండలంలోని కల్లెడ గ్రామ పంచాయతీలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుకన్య, తపాలా బీమా, సుకన్య సమృద్ధి యోజన, చిన్న మొత్తాల పొదుపులు తదితర సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ జెండాల విక్రయాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ



**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ బయలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో ఇటీవల స్కూల్ అసిస్టెంట్ బయాలజీగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్ లో జరిగింది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులలో కొంతమంది ఉపాధ్యాయులు జీవశాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు పరంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలు, విధి విధానాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, నిర్మాణాత్మక మూల్యాంకనం మరియు సంగ్రహణాత్మక మూల్యాంకనం తదితర అంశాలపైన టీబీఎస్ఎఫ్ వరంగల్ విషయ నిపుణుల బృందంచే నూతనంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సమగ్రమైన అవగాహనను ఈ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ద్వారా కల్పించబడింది. జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో బయాలజీ సబ్జెక్టు ఫోరం విషయ నిపుణులు కిరణ్, కృష్ణ, రమేష్, రాజు, ధనలక్ష్మి, పరమేశ్వర్, సుమలతలు పలు రకాల అంశాల పైన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి విచ్చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, కాకతీయ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర ప్రొఫెసర్ వెంకయ్య, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ కొత్తగా స్కూల్ అసిస్టెంట్ గా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులను తమ విధుల పట్ల, విద్యార్థుల శ్రేయస్సు పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన టీబీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా శాఖను అభినందించారు.

# పేదల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. కాజీపేట మండల పరిధిలోని 44, 45, 46, 64 డివిజన్ల పరిధిలో అనారోగ్యానికి గురైన వివిధ గ్రామాలకు చెందిన 45 మంది బాధితులకు మంజూరైన 11లక్షల 14వేల 500 రూపాయల చెక్కులను ఎంపీ కడియం కావ్యతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు సుమారు 43 లక్షల 4 వేల 908 రూపాయల విలువ గల చెక్కులను నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడలేని విధంగా మన రాష్ట్రంలో ప్రజాకర్షక పథకాలను రూపకల్పన చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బంగారు తెలంగాణ నిర్మాణమే ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస రెడ్డి, మెట్టుగుట్ట దేవస్థాన చైర్మన్ పైడిపాల రఘు చందర్, డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, రాజారపు స్వామి, కాంటెస్టెంట్ కార్పొరేటర్లు బైరి లింగమూర్తి, వస్కుల నాగరాజు, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ-కృష్ణ, యూత్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, బస్కె ప్రణయ్, మహిళా అధ్యక్షురాలు నీలం రజినీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, తహసీల్దార్, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ రక్షణ విభాగానికి ఎన్సీసీ ఒక పునాది



**వరంగల్ వాయిస్, కేయూ :** స్థానిక కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎన్సీసీ పదో తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో సీఏటీసీ 6వ క్యాంపు జరుగుతున్నట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు కొనసాగుతున్న క్యాంపు తొమ్మిదవ రోజు క్లోజింగ్ సెర్మనీ సాంస్కృతిక, ముగింపు కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ ఎన్సీసీ అనేది ఎంతో క్రమశిక్షణకు మారుపేరని అన్నారు. భారత దేశ రక్షణ విభాగానికి ఒక పునాదిరాళ్లుగా నిలుస్తుందన్నారు. ఎన్ సీసీ క్యాడెట్స్ నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. దేశ రాజధానిలో ఓరుగల్లు సత్తాను చాటాలని ఆశీర్వదించారు. మరో విశిష్ట అతిథి వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ అడ్మినిస్ట్రేవ్ ఆఫీసర్ పాల్ స్మిలి వరంగల్ ఖమ్మం గ్రూప్ ఎన్సీసీ యాక్టివిటీస్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ లాల్, హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్ కుమార్, కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వెంకయ్య, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నర్ రవి సునారే, ఖమ్మం బెటాలియన్ కమాండింగ్ అధికారి, 8 గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి, వన్ ఇంజినీరింగ్ కమాండింగ్ ఆఫీసర్, ఐటీ డాక్టర్ మంజుల, క్యాంపు అర్జెంటుగా కెప్టెన్ డాక్టర్ పి.సతీష్ కుమార్, క్యాంపు క్వార్టర్ మాస్టర్ గా కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, సుబేదార్ మేయర్ సుహాస్ కదం, లెఫ్టినెంట్ గణేష్, సెకండాఫీసర్ ప్రవీణ్, ఫస్ట్ ఆఫీసర్ కుందూర్ సందీప్ రెడ్డి, బీహెచ్ఎం మానే ప్రదీప్, బాల్ రెడ్డి, లెఫ్టినెంట్ సబిత, థర్డ్ ఆఫీసర్ శాంతి, జేసీఓలు సౌరస్య, కదం, ఏడుకొండలు, జీసీఐ సుజిత, జీసీఐ శీతల్, పీఐ స్టాప్, 580 మంది కేడెట్ ఈ క్యాంపులో పాల్గొన్నారు. విజేతలకు వివిధ పోటీలు క్రీడ, బెస్ట్ ఫైరింగ్, ఉత్తమ కాడెట్ ప్రదర్శించిన వారికి ముఖ్య అతిథిచే బహుమతులు ప్రదానం చేశారు.

# విధి నిర్వహణలో మానవత్వం చాటిన ఆర్టీసీ డ్రైవర్

## ఘనంగా సన్మానించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్-2 డిపోలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న బి.వెంకన్న డ్యూటీలో భాగంగా టీఎస్ 3జడ్ 0483 సూపర్ లగ్జరీ బస్సులో ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి వరంగల్ వచ్చే క్రమంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడికి ఫిట్స్ వచ్చాయి. పిట్స్ తో పాటు నోటి నుంచి నురగ కారడంతో గమనించిన డ్రైవర్ తను ప్రయాణిస్తున్న మార్గంలో వైద్యశాలలు లేవన్న విషయాన్ని గ్రహించి బస్సును బీబీనగర్ వద్ద గల ప్రైవేట్ ఆసుపత్రిలోని ఓపీ విభాగంలోనికి తీసుకొని వెళ్లి అనారోగ్యం పాలైన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించి తిరిగి విధి నిర్వహణలో నిమగ్నుడై వరంగల్ కు ప్రయాణమయ్యారు. ఈ విషయంపై బస్సులో ఓ ప్రయాణికుడి ద్వారా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ దృష్టికి వెళ్లడంతో హైదరాబాద్ బస్సు భవన్ కు డ్రైవర్ వెంకన్నను పిలిపించి అధికారులందరి సమక్షంలో సజ్జనార్ ఘనంగా సన్మానించారు. అతని మయస్ఫూర్తిని కొనియాడారు. రీజినల్ మేనేజర్ డి.విజయ భాను, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జి.మాధవరావు, వరంగల్-2 డిపో మేనేజర్ వి.జ్యోత్స్న, ఇతర అధికారులు, డ్రైవర్ బి.వెంకన్నను అభినందించారు.

# మున్సిపల్ ఉద్యోగ ,కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఉద్యోగ ,కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పారిశుద్ధ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని భవిష్యత్తు పోరాటాల కార్యక్రమం నిర్ణయించడానికి ఏఐటీయూసీ, టీఎంఆర్పీఎస్, టీఎంఈడబ్ల్యూ, జేఏసీ, అనుబంధ సంఘం హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో వేల్పుల సారంగపాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం, పరకాల మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఏఐటీయూసీ, అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజు, రమేష్, కుమార్, కవిత, లత, యాదమ్మ, భాగ్యమ్మ, సుమారుగా 100 మంది పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

మంగళవారం 13, ఆగస్టు 2024
www.warangalvoice.net

# కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చుతాం

## ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్ర నాయక్ అన్నారు. డోర్నకల్ మండల కేంద్రంలోని జైన్ భవనంలో డ్వాక్రా మహిళలకు రుణమేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇందులో 315 సంఘాలకు బ్యాంక్ లింకేజీ ఋణాలు రూ.29.75 కోట్లు, స్త్రీ నిధి ద్వారా 22 సంఘాలకు రూ.1.20 కోట్లు ఋణాలను మేళా ద్వారా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, వీరి సంఖ్యను కోటికి పెంచి వారందరినీ కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్వయం సహాయక సంఘాలకు ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.340 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో రూ.140 కోట్లు, మొత్తం 480 కోట్ల బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వ అందిస్తుందని, ఆర్థికంగా వారికి చేతన అందిస్తుందని, కొత్త విద్యుత్ పాలసీలో భాగంగా మహిళలను సోలార్ విద్యుత్ వైపు మళ్లించి ఆర్థికంగా ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం 63 లక్షల మహిళలను విజయవంతమైన వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే ధ్యేయంతో ఇందిరా మహిళా శక్తి పథకానికి రూపకల్పన చేసిందన్నారు. స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం అనే మార్గాల ద్వారా లక్ష కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి ఈ లక్ష్యం సాధిస్తామన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించడంతో పాటు బ్రాండింగ్, మార్కెటింగ్ లలో మెలకువలు పెంపొందించే విధంగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, స్పెషల్ ఆఫీసర్ నర్సింహా మూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం శంకర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, కాంగ్రెస్ నాయకులు బత్తుల శ్రీనివాస్, కాసం శేఖర్, వెంకట్ బాబు, సత్తి రెడ్డి, అంగోత్ వెంకన్న, ఖాదర్ బాబా, నాగరాజు, శంకర్, ఫరీద్ తదితరుల పాల్గొన్నారు.

## లీకేజీ నల్లాతో రోడ్డు బురదమయం



**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు :** వరంగల్ హంటర్ రోడ్డు సంతోషిమాత కాలనీలో ఇంటి ముందు రోడ్డును పూర్తిగా లీకేజీ నల్లాతో రోడ్డు మొత్తం గడ్డితో, మురుగు నీటితో బురదమయంగా మారుతోంది. దీంతో స్థానిక ప్రజల రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల స్పందించి తగిన చర్యలు చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

## అస్తవ్యస్తంగా రోడ్డు.. వాహనదారుల ఇబ్బందులు



**వరంగల్ వాయిస్, జేపీఎన్ రోడ్డు :** వరంగల్ చౌరస్తాలో దుర్గేశ్వర స్వామి దేవాలయం రోడ్డు అధ్వాన్నంగా మారింది. దీంతో ఆ మార్గం గుండా ప్రయాణించే వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయాణించే క్రమంలో అదుపు తప్పి పడిపోయి ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వెంటనే మున్సిల్ కార్పొరేషన్ అధికారులు పర్యటించి రోడ్డు పరిస్థితి పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాయపర్తిలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రాయపర్తి పీహెచ్ సీ పరకాలలో డీఎంహెచ్ఓ ఆదేశానుసారం క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించడం జరిగింది. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్కీనింగ్ క్యాంపు ఏర్పాటు చేసి 30 సంవత్సరాలు పైబడిన దాదాపు 130 మంది ప్రజలను పరీక్షించారు. ఓరల్, సర్వికల్ క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నవారిని గుర్తించేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ ప్రజలు పోగాకు, సిగరెట్, గుట్కా, మద్యపానానికి దూరంగా ఉండాలని కోరారు. సేంద్రియ ఎరువులతో పండించిన ఆహారాన్ని భోజనంగా స్వీకరించాలన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ హెచ్ పీ డాక్టర్లు అనూహ్య, అపర్ణ, మాధవి, వంశీ జ్యోతి, పీహెచ్ఎన్ ఎలిజబెత్, సూపర్ వైజర్లు ఇమ్మడి బాబు, అరుమాకుమారి, ప్రశాంతి విజయమెరి, స్టాఫ్ నర్స్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు .

## సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** గుర్తూరు ఉపకేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొర్రూరు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రూప మాట్లాడుతూ ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి జ్వరంతో బాధపడుతున్నట్లయితే వెంటనే డాక్టర్ ను సంప్రదించి జ్వర పరీక్షలు నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా నీటి కాలుష్యంతో అతిసారం, విరేచనాలు, టైపాడ్, డయేరియా హెపటైటిస్ ఏంబేసిస్ లు, దోమలతో వచ్చే వ్యాధులు చికెన్ గున్యా, మలేరియా, డెంగీ, ఎల్లో ఫీవర్, పైలేరియాసిస్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు నివారణ మార్గాలను తెలియపరిచారు. ఈ సీజనల్ లో కాల్చి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రత పాటించాలని, పరిసరాల చుట్టూ ఇంట్లో పరిశుభ్ర వాతావరణ ఉండే విధంగా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించాలని తెలియపరిచారు. ఈ హెల్త్ క్యాంపుకు హాజరైన ప్రతి ఒక్కరికి బీపీ షుగర్ పరీక్షలను చేసి మందులను ఉచితంగా అందజేశారు. హెల్త్ సూపర్ వైజర్ మంత్య, ఎంపీహెచ్ ఏఈ శ్రీనివాస, ఏఎన్ఎం రామాంజలి దేవి, జి.సునీత, ఆశాలు ఈ కృష్ణవేణి. వి.స్వరూప, బి.స్వరూప, ఏ.రాజేశ్వరి, కారోబార్ జి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** మండలంలోని చలపతి గ్రామానికి చెందిన కుంటమల్ల గణేష్ జీవనోపాధి కోసం పాత బీట్ బజార్ లో ఆటో ట్రాలీ నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. 10 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో మృతిచెందిన కుంటమల్ల గణేష్ కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో పాత బీటు బజార్ లోని లక్ష్మీ గణపతి ఆటో ర్యాలీ సంఘం రూ.40,000 ఆర్థిక సహాయం అందజేశారు. గణేష్ కు ముగ్గురు పిల్లలు భార్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఆకుతోట రాజు, గౌరవాధ్యక్షుడు కొమ్ము చేరాలు, ప్రధాన కార్యదర్శి మద్దూరి రవీందర్, తోకల ప్రభాకర్, కొమ్ము రేవంత్, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం విజయవంతం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "ప్రపంచ అవయవదాన దినోత్సవం" పురస్కరించుకొని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీలో జీవన్ దాన్, హైదరాబాద్, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్, వరంగల్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సంయుక్తంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మంగళవారం "ప్రపంచ అవయవదాన దినోత్సవం" అవహగాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, గతంలో అవయదానం చేసిన వారి కుటుంబసభ్యులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఆగస్టు 13 న ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి తలకు రక్తసరఫరా నిలిచిపోవడంతో బ్రెయిన్ డెడ్ గా నిర్ధారిస్తారన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలు స్వీకరంచి ఎనిమిది మంది ప్రాణాలు నిలుపవచ్చునని తెలిపారు. అవయవ దానం పై ఇప్పటికి జిల్లా వాసుల్లో చాలా అపోహలు ఉన్నాయని, అవయవ దానం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి రెడ్ క్రాస్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అవయవ దానంపై కరపత్రం ఆవిష్కరించి తలసేమియా బాధితులను కాపాడేందుకు యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ రక్తదాన శిబిరాన్నిఏర్పాటు చేసి రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ పాలకవర్గం ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందచేయడం జరిగింది. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్ ఆర్గనైజర్లను, కమిటీ సభ్యులను, రక్తదాతలను రెడ్ క్రాస్ పాలకవర్గం పక్షాన అబినందించారు. ఈ రక్తదాన శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, గుండె వైద్యనిపుణులు డాక్టర్ భగీరద్ తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోషికేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, జీవన్ దాన్ సంస్థ పీఆర్వో శివ, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), గుల్లెపెల్లి శివ కుమార్ (రెడ్ క్రాస్), బొట్టు కమలాకర్, గజ్జెల సుమన్, ఉప్పరపెల్లి రాజ్ కుమార్, ఊరటి రవికుమార్, అలువాల పృథ్వీ, పోలీస్ కానిస్టేబుల్స్ రవీందర్, విజయ్ కుమార్, దయాకర్ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, మండల పరుశరాములు, రెడ్ క్రాస్ సొసైటీ డాక్టర్ టి.మదన్మోహన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది ఎ.సురేష్, బి.వాహిని, రమేష్, శ్రీకాంత్, రక్తదాతలు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న 17,514 మంది ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని, 510 జీఓలో నష్టం జరిగిన 4000 వేల ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వివిద శాఖలో ఏ విధంగానైతే ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనము చెల్లిస్తున్నారో అదే విధంగా ఎన్ హెచ్ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు.హర్యాన, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార?ండ్, మణిపూర్ ఆయా రాష్ట్రాలలో ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరిని రేగ్యులరైజెషన్ చేశారు. కాబట్టి, తెలంగాణ రాష్ట్రం కూడా ఎన్ హెచ్ఎం ఉద్యోగులందరిని రేగ్యులరైజేషన్ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అందరి ఉద్యోగుల ఆరోగ్యానికి మేము రక్షణ అని సేవలందిస్తున్న మా జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్, ఆరోగ్య బీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నిర్మాతగా నిహారిక సక్సెస్

## అభినందనలు తెలుపుతున్న సినీ ప్రముఖులు



నిర్మాతగా వ్యవహరించిన తొలి సినిమా కమిటీ కుర్రోళ్ళుతోనే విజయాన్ని అందుకున్నారు నిహారిక. 16 మంది కొత్త నటీనటులతో 'కమిటీ కుర్రోళ్ళు' ను నిర్మించారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. దీంతో సినీ సెలబ్రిటీలు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. తాజాగా రామ్ చరణ్ ఈ సినిమాను ఉద్దేశించి పోస్ట్ పెట్టారు. 'నిహారిక.. ఘన విజయాన్ని సాధించినందుకు అభినందనలు. ఈ విజయానికి నువ్వు అర్హురాలివి. నీ టీమ్‌తో కలిసి నువ్వు పడిన కష్టం.. నీ కృషి, అంకిత భావం నిజంగా స్ఫూర్తిదాయకం. 'కమిటీ కుర్రోళ్ళు'లో భాగమైన అందరికీ అభినందనలు. ముఖ్యంగా ఈ కథకు జీవం పోసిన దర్శకుడు యదు వంశీకి ప్రత్యేక అభినందనలు' అని పేర్కొన్నారు. తాజాగా దర్శకధీరుడు రాజమౌళి కూడా ఈ టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే హీరో నానితో పాటు.. సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్, స్టార్ డైరెక్టర్‌లు నాగ్ అశ్విన్, క్రిష్, సుకుమార్‌లు 'కమిటీ కుర్రోళ్ళు' టీమ్‌ను అభినందించారు. నూతన దర్శకులు, నటీనటులను ప్రోత్సహించాలని, కొత్త కథలను ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో నటి నిహారిక దీన్ని నిర్మించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే విభిన్నమైన కథతో వంశీ దీనిని రూపొందించారు. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ సినీప్రియుల ఆదరణను సొంతం చేసుకుంది.



## మీడియా సమావేశంలో షారూఖ్ సరదా వ్యాఖ్యలు

# గూగుల్‌ను అడిగితే..




బాలీవుడ్ హీరో షారుక్ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్నారు. తాజాగా 77వ లోకార్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్ఠాత్మకమైన పార్డో అల్లా కెరియరా అవార్డును అందుకొని అందరి దృష్టినీ ఆకర్షించారు. స్విట్జర్లాండ్ వేదికగా ఈ ఈవెంట్ జరిగింది. అక్కడి మీడియాతో మాట్లాడుతూ షారుక్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 'నా గురించి తెలియక పోతే గూగుల్‌ను అడగండి. అది ఏం చెబుతుందో విని నన్ను ప్రశ్నలు అడగండి' అని షారుక్ సరదాగా అన్నారు. ఈ వ్యాఖ్యలపై గూగుల్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో స్పందించింది. మీరు కింగ్ అనే అర్థం వచ్చేలా కిరీటం ఎమోజీని పోస్ట్ చేసి షారుక్‌ను ట్యాగ్ చేసింది. దీనిపై అభిమానులు ఆసక్తికర కామెంట్స్ చేస్తున్నారు. 'సినీ పరిశ్రమకు మీరు కింగ్' అని ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. 'మీరు కింగ్ అని గూగుల్‌కు కూడా తెలుసు' అని మరో అభిమాని అన్నారు. ఈ ఈవెంట్‌లో షారుక్ మాట్లాడుతూ.. దక్షిణాది చిత్రపరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. 'సౌత్ ఇండస్ట్రీలో ప్రతిభావంతులైన వారున్నారు. గొప్ప కథలను తెరకెక్కిస్తున్నారు. భారతీయ సినీ రంగంలో గొప్ప సూపర్ స్టార్‌లు చాలా మంది సౌత్ నుంచి వచ్చిన వారే. అక్కడి వారితో కలిసి నేను పనిచేశాను. ఎక్కువ మంది దర్శకులతో కలిసి వర్క్ చేయాలని ఆసక్తిగా ఉన్నాను. ఎందుకంటే సౌత్ ఇండస్ట్రీ ఎప్పుడూ ప్రత్యేకమే. మణిరత్నం దర్శకత్వంలో 'దిల్‌సే'లో నటించాను. ఇంతకు మించి నాకు ఇంకేం కావాలి. 'బాహుబలి', 'ఆర్‌ఆర్‌ఆర్', 'జవాన్' వంటి చిత్రాలు ఇండియన్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. భారీ బడ్జెట్ చిత్రాలను రూపొందించడంలోనూ దక్షిణాది పరిశ్రమ ముందుంటుంది' అని చెప్పారు. చిత్ర పరిశ్రమకు ఆయనందించిన సేవలకుగాను షారుక్ పార్డో అల్లా కెరియరా అవార్డును అందుకున్నారు. ఇలాంటి గౌరవాన్ని పొంది చరిత్ర సృష్టించిన మొదటి భారతీయ నటుడిగా షారుక్ ఖాన్ నిలిచారు. సినిమాల విషయానికొస్తే.. సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో షారుక్ 'కింగ్'లో నటించనున్నారు.

# నా పై రాసే ముందు సంప్రదించరా

## డేటింగ్‌పై సోషల్ మీడియా ప్రచారంపై కృతి ఆగ్రహం

తనకంటే 10 ఏళ్ల చిన్న వ్యక్తితో డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన రూమర్స్ ఎంతో బాధించాయని నటి కృతిసనన్ అన్నారు. యూకేకు చెందిన కబీర్ బహియాతో కృతి డేటింగ్ చేస్తున్నట్లు ఇటీవల కొన్ని రూమర్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఆమె పుట్టినరోజు వేడుకను కబీర్‌తో కలిసి చేసుకున్నారని ఊహాగానాలు వినిపించాయి. వీళ్లిద్దరూ త్వరలోనే పెళ్లి చేసుకోనున్నట్లు వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. 'నా గురించి తప్పుడు సమాచారాన్ని రాసినప్పుడు నాతో పాటు నా కుటుంబం కూడా బాధపడుతుంది. దాని వల్ల వచ్చే పరిణామాలు మేమంతా ఎదుర్కోవాలి. ఎలాంటి వార్తలైనా సోషల్ మీడియా ద్వారా త్వరగా ప్రజల్లోకి వెళ్తాయి. అవి నిజమని భావించి ఎంతోమంది నాకు మెసేజ్‌లు చేస్తున్నారు. ఈ అబద్దాల గురించి నిరంతరం స్పందించాలంటే చికాకు వేస్తోంది. అన్నిటికంటే ఇది ఎంతో ఇబ్బందిగా ఉంటుంది. '34 ఏళ్ల కృతి తన కంటే 10 ఏళ్ల చిన్న వ్యక్తితో డేటింగ్ చేస్తోంది' ఈ హెడ్డింగ్ ఎంతో మంది ఉపయోగించారు. ఏ మాత్రం నిజానిజాలు తెలుసుకోకుండా వారి ఇష్టం వచ్చినట్లు రాసేశారు. ఇలా రాయడం ఈరోజుల్లో కామన్ అయిపోయింది. గతంలో సోషల్ మీడియా లేనప్పుడు వార్తపత్రికల్లో వచ్చింది చూసి ప్రజలు ఓ అభిప్రాయానికి వచ్చేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. నెగెటివ్ కామెంట్స్ పెట్టడం ట్రెండ్ అయిపోయింది. వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం.. అవతలి వారిపై రూమర్స్ క్రియేట్ చేయడం ఒకటి కాదు' అంటూ కృతి అసహనం వ్యక్తం చేశారు.





## రిలీజ్‌కు రెడీ ..

# సరిపోదా శనివారం

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నానినటిస్తోన్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. గ్యాంగ్‌లీడర్ ఫేం ప్రియాంక అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 29న విడుదల చేస్తున్నారు. కాగా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. కాగా ట్రైలర్ టైంను గుర్తు చేస్తూ నాని హంగామా షురూ అంటూ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎక్స్‌లో నయా లుక్ ఒకటి షేర్ చేసింది. ఈ లుక్ చూసిన అభిమానులు ట్రైలర్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని తెగ ఎదురుచూస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఆఫీసులో నాని.. డ్యూటీ లో ప్రియాంకా మోహన్ చాట్‌లో ఉన్న స్టిల్స్ షేర్ చేశారని తెలిసిందే.. యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో ఎస్‌జే సూర్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వస్తోన్న ఈ మూవీ ఇతర భాషల్లో టైటిల్‌తో రిలీజ్ కానుంది.



# నేతన్నలకు అండగా ఉంటా

## ఎంపీ డాక్టర్ కడియం కావ్య
## పవర్ లూమ్ కార్మికులతో చర్చలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేత కార్మికులకు అండగా ఉంటూ కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు పొందే విధంగా సహకారం అందిస్తానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. సోమవారం మడికొండ టెక్స్ టైల్ పార్కులో గ్రీన్ టెక్నాలజీ ఆవిష్కరణ వర్క్ షాప్ కమ్ అడాప్షన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్న ప్రసంగించారు. పవర్ లూమ్ నేత కార్మికులతో జరిగిన చర్చలో పాల్గొన్నారు. సిడ్బీ, సీఐపీ కింద అందించే కార్యక్రమాల్లో నేత కార్మికులు పాల్గొని ఉత్తమ పద్ధతులను అవలంబించాలని ఎంపీ సూచించారు. నేత కార్మికులకు సంబంధించిన తన మాటలను కవిత రూపంలో వ్యక్తపరిచారు. టెక్టైల్స్ పార్క్ నందు పవర్ లూమ్ క్లస్టర్ సూరత్, సోలాపూర్ నుంచి వచ్చి ఇక్కడ వర్క్ నిర్వహిస్తున్న వారికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం స్మృతి, ప్రొఫెసర్ పద్మనాభం, గౌరవ అధ్యక్షుడు స్వామి, అధ్యక్షుడు శ్రీరాములు, నేత కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..

పేదలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రకటించారు. కాజీపేట మండల పరిధిలోని 44, 45, 46, 64 డివిజన్ల పరిధిలో అనారోగ్యానికి గురైన వివిధ గ్రామాలకు చెందిన 45 మంది బాధితులకు మంజూరైన రూ.11,14,500 విలువైన చెక్కులను ఎంపీ కడియం కావ్యతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కళ్యాణ లక్ష్మి, షాదిముభారక్ లబ్ధిదారులకు సుమారు రూ.43.05 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతు.. ఆరోగ్య శ్రీ పథకం ద్వారానే కాకుండా ఆరోగ్య శ్రీ పథకం వర్తించని వ్యాధులకు, పేదలను ఆదుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస రెడ్డి, మెట్టుగుట్ట దేవస్థాన చైర్మన్ పైడిపాల రఘు చందర్, డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, రాజారపు స్వామి, కంటెస్టెంట్ కార్పొరేటర్లు బైరి లింగమూర్తి, వస్కుల నాగరాజు, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ - కృష్ణ, యూత్ నాయకులు కర్ర హరీష్ రెడ్డి, బస్కె ప్రణయ్ తోపాటు మహిళా అధ్యక్షురాలు నీలం రజిని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ఎమ్మార్వో, అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన 'బిట్టు'

## పోలీస్ జాగిలానికి ఘన సత్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుదీర్ఘ కాలంగా వరంగల్ పోలీస్ విభాగానికి సేవలందించిన పోలీస్ జాగిలానికి అధికారులు మంగళవారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీస్ జాగిలం బిట్టును ఘనంగా సత్కరించారు. 2013 డిసెంబర్ 26న వరంగల్ పోలీస్ కమిషనరేట్ జాగిలాల విభాగంలో బిట్టు పేరుతో చేరిన స్నిఫర్ డాగ్ సుమారు పదకొండు సంవత్సరాలు పాటు పోలీస్ శాఖకు సేవలందించింది. ప్రధానం ఈ జాగిలం ప్రధాన మంత్రులు, రాష్ట్ర ముఖ్య మంత్రులతో పాటు ఇతర వీఐపీలు పర్యటించే సందర్భాల్లో పేలుడు పదార్థాలను గుర్తించడంలో కీలకంగా వ్యవహరించింది. ఉద్యోగ వీరమణ పొందిన పోలీస్ జాగిలం బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించేవాడు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో జాగిలం విభాగం చాలా కీలకమని, నేరస్తులను పట్టుకోవడంతో పాటు, పేలుడు పదార్థాలు, ప్రస్తుతం మత్తు పదార్థాలను గుర్తించడంలో పోలీస్ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమములో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్.ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, శ్రీధర్, చంద్రశేకర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జి ఆనంద్‌తో పాటు ఇతర డాగ్ స్క్వాడ్ విభాగం సిబ్బంది పాల్గోన్నారు.



# ఘనంగా హర్ ఘర్ తిరంగ అభియాన్

## పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప ఆధ్వర్యంలో తిరంగ యాత్ర పోచమ్మమైదాన్ నుంచి పటేల్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని జాతీయ త్రివర్ణ పతకా జెండాలతో నిర్వహించిన తిరంగ యాత్ర ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతి పౌరుడు భారత జాతి సమైక్యతను కాపాడుతూ భావి తరాలలో దేశ భక్తి స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని, భారత జాతి సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, మల్లాడి తిరుపతిరెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు భరత్ వీర్, జిల్లా మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 28వ డివిజన్‌లో..

నగరంలోని 28వ డివిజన్ లో స్థానిక కార్పొరేటర్ గందే కల్పన-నవీన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన మహిళలు భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొన్నారు.






# మహనీయుల త్యాగ ఫలితమే..
# అఖండ భారత్ నిర్మాణం

## హర్ ఘర్ తిరంగ యాత్ర బైక్ ర్యాలీలో
## మోరే రవీందర్ రెడ్డి, చెవ్వ శేషగిరి యాదవ్

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** మహనీయుల త్యాగ ఫలితంగానే అఖండ భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి, మొగుళ్ళపల్లి మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి యాదవ్ అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయుల వీరోచిత పోరాటాలు, ప్రాణ త్యాగాల ఫలితమే మనకు స్వాతంత్యం తెచ్చిపెట్టిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయులను స్మరించుకొని..భారతీయులలో దేశభక్తిని పెంపొందించడానికి మన ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ నాయకులు బైక్ ర్యాలీని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సామూహికంగా వందేమాతర గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవీందర్ రెడ్డి, శేషగిరి యాదవ్ మాట్లాడారు. దేశంలోని పౌరులందరూ కులాల కతీతంగా, మతాలకతీతంగా ఐకమత్యంతో భారతదేశ అభివృద్ధికి కంకణ బద్ధులు కావాలన్నారు. మతాల కుంపటిలో చిచ్చు రగిల్చే కుహనా లౌకిక వాదుల కుట్రల బారి నుంచి మన దేశాన్ని రక్షించుకునేందుకు..మనమంతా భారతదేశ అభ్యున్నతికి పాటుపడే వారి నాయకత్వాన్ని ఎంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారి రవీందర్, సామల మధుసూదన్ రెడ్డి, బత్తిని శ్రీధర్ గౌడ్, బండారి శ్రీనివాస్, సమ్మోజి భాస్కర్, రాస భిక్షపతి, రేపాల శ్రీనివాస్, తూముల సురేష్, శ్రీరామ్ కుమార్, శక్తి కేంద్ర ఇన్చార్జి పులి వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్, చిలుముల రాజేంద్రప్రసాద్, జలంధర్, బోయిని కుమారస్వామి, ఊరుకొండ ఓదెలు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com